

## కొత్తగా మూడు కరోనా కేసులు

**విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఆదివారం మరో మూడు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 52 మందికి పరీక్షలు నిర్వహించగా, ముగ్గురికి పాజిటివ్‌గా తేలిందని అధికారులు తెలిపారు. వీటితో ఇప్పటివరకు మొత్తం 76 మందికి కొవిడ్ వైరస్ సోకినట్టు తేలింది. ప్రస్తుతం 11 యాక్టివ్ కేసులు ఉన్నాయి. వీరిలో పది మంది హోమ్ ఐసోలేషన్‌లో ఉండగా, ఒకరు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆదివారం వైరస్ బారినపడిన ముగ్గురూ హోమ్ ఐసోలేషన్‌లోనే ఉన్నారు.

# సంబరంగా భోగి

## ఘనంగా జరుపుకున్న నగర వాసులు

- ప్రతి వీధిలో భోగి మంటలతో సందడి
- సింహగిరిపై అంబరాన్నంటిన సంబరాలు



నగరంలోని ఆక్సిజన్ టవర్స్ వద్ద భోగి సందడి

**విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి):** భోగి పండగను ఆదివారం నగర వాసులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే అపార్టుమెంట్లు, కాలనీల్లో యువత భోగి మంటలు వేసి సంప్రదాయబద్ధంగా పండగ నిర్వహించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అందరూ భోగి మంటల వద్ద సందడి చేశారు. కాగా సింహగిరిపై భోగి సంబరాలు అంబరాన్ని అంటాయి. శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సంక్రాంతి ఉత్సవాలను ప్రారంభించారు. సింహగిరిపై గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా వరిచేను కుప్పలు, ఎడ్లుబండ్లు, పూరిగుడిసెలు, ధాన్యపురాశులు, డూడూ బసవన్నలు, హరిదాసు కీర్తనలు, తప్పెటగుళ్లు, మహిళల చెక్కభజన, కుమ్మరిచక్రంతో మట్టి ప్రమిదల తయారీ భక్తులను కట్టిపడేశాయి. కొండపై పండగ సందడి కనిపించింది. యువతులు, మహిళలు ధాన్య పురాశుల్లో నుంచి చేతితో ధాన్యాన్ని తీసి గాలిపట్టడం, కండల్లో పోసి గ్రామీణ ప్రాంత అనుభూతులను సొంతం చేసుకున్నారు.

సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ వద్ద భోగిమంటలు వేసి అపార్ట్‌మెంట్‌లోని నివాసితులు పండుగ చేసుకున్నారు. టీడీపీ కార్యాలయం వద్ద దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి గండిబాబ్జి ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జారీ అయిన చీకటి జీవోల ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. జిల్లా కోర్టు వద్ద ల్యాండ్ టైటిల్‌యాక్ట్ జీవోలను న్యాయవాదులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది తమ 34వ రోజు ఆందోళనలో భాగంగా పండగపూటా పస్తులుంచారంటూ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఖాళీ వంట సామగ్రితో నిరసన తెలిపారు.

సింహగిరిపై సంక్రాంతి సంబరాలు



రద్దీ లేని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు



## పట్నం.. పల్లెబాట!

- సంక్రాంతికి నగరం నుంచి స్వస్థలాలకు తరలివెళ్లిన ప్రజలు
- నిర్మానుష్యంగా మారిన ప్రధాన కూడళ్లు
- బీచ్, జూపార్క్‌లో తగ్గిన సందర్శకుల రద్దీ

(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

నిత్యం రద్దీగా కనిపించే నగరం ఆదివారం సాయంత్రానికి ఖాళీగా దర్శనమిచ్చింది. సంక్రాతిని సొంతూరులో ఘనంగా జరుపుకునేందుకు నగరంలో నివాసముండే అత్యధికులు కుటుంబాలతో సహా తరలి వెళ్లారు. దీంతో నిత్యం రద్దీతో... వాహనాల రణగొణ ధ్వనులతో పద్మవ్యూహాన్ని తలపించే ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారిపోయాయి. వాహనాల తాకిడి తగ్గిపోవడంతో రోడ్లు ఖాళీగానే కనిపించాయి.

సంక్రాంతి ప్రధాన పండగ కావడంతో ఉద్యోగం, వ్యాపారం, ఉపాధి, ఇతర అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉంటున్నవారు, స్థిరపడిన వారు కూడా స్వస్థలాలకు వెళ్లి పండగ జరుపుకోవడానికి ఆసక్తిచూపుతారు. నగరంలో నివసిస్తున్న వారిలో అత్యధికులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ రూరల్ జిల్లాతోపాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల వారే. దీంతో వారంతా కుటుంబసభ్యులతో సహా స్వస్థలాలకు తరలివెళ్లిపోయారు. పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు కావడంతో ముందు నుంచీ చాలామంది సొంతూర్లకు వెళ్లారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఈనెల 13 నుంచి 16 వరకూ సెలవులు ప్రకటించడంతో ఉద్యోగాలు చేసేవారంతా 12 సాయంత్రం నుంచే పయనమయ్యారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారు, ఇతర వృత్తులు, వ్యాపారులు, కూలిపనులు చేసుకునేవారిలో అత్యధికులు ... మిగతా 6వ పేజీలో

# ఏయూ వీసీ పోస్టుపై వీడని సస్పెన్స్

## సెర్చ్ కమిటీ నివేదిక సమర్పించినా తేలని వైనం



మంత్రి బొత్స
ప్రసాదరెడ్డి

ఇప్పటికీ ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఫైల్ పెండింగ్

- సంక్రాంతి తరువాత తేల్చే అవకాశం
- వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ ప్రకటనతో మారిన సమీకరణాలు
- తాజా మాజీ వీసీ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మంత్రి బొత్స

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ పోస్టు భర్తీపై సస్పెన్స్ కొనసాగుతోంది. గత నెలాఖరులోనే కొత్త వీసీ బాధ్యతలు తీసుకుంటారని ఏయూలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయినప్పటికీ ప్రక్రియ ముందుకు సాగ లేదు.

తాజా మాజీ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి పదవీకాలం గత ఏడాది నవంబరు 24న ముగిసింది. ఆ స్థానంలో రెక్టార్ ప్రొఫెసర్ కె.సమతకు ప్రభుత్వం ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. అప్పటికే వీసీ ఎంపికకు వీలుగా సెర్చ్ కమిటీ నియామకం కూడా చేపట్టింది. ఆ కమిటీ రెండు పర్యాయాలు సమావేశమై ముగ్గురు పేర్లతో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించింది. దీంతో డిసెంబరులోనే కొత్త వీసీ బాధ్యతలు చేపడతారని వర్సిటీ వర్గాలు భావించాయి. అయితే అనేక కారణాలతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతూ వస్తోంది. అంతేకాకుండా సెర్చ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఇప్పటికీ ముఖ్యమంత్రి కార్యాలయంలోనే పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు. కమిటీ ... మిగతా 6వ పేజీలో

## పొగమంచుతో పలు విమానాలు రద్దు

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు
- ఎయిర్‌పోర్టు సిబ్బందితో వాగ్వాదం

**గోపాలపట్నం, జనవరి 14:** పొగమంచు కారణంగా దేశంలోని పలు ప్రాంతాల నుంచి విశాఖ వచ్చి, వెళ్లాల్సిన పలు విమాన సర్వీసులు ఆదివారం రద్దయ్యాయి. దీంతో పండగపూటా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అండమన్-విశాఖ-ఢిల్లీ, విశాఖ-ముంబై, ఢిల్లీ-విశాఖ-ఢిల్లీ, చెన్నై-విశాఖ-చెన్నై, తిరుపతి-విశాఖ-విజయవాడ, ఢిల్లీ-విశాఖ-ఢిల్లీ వెళ్లాల్సిన ఇండిగో, ఎయిర్ ఇండియా విమాన సర్వీసులను పొగమంచు కారణంగా రద్దు చేశారు.

**ఆందోళనకు దిగిన ప్రయాణికులు**

పండగ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి విశాఖ వచ్చే వారితో పాటు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు విమానాల రద్దుతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గమ్యానికి చేరే మార్గం లేకపోవడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో తీవ్ర అసహనానికి గురై విమానయాన సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.



విమానయాన సంస్థ సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం

## పండగ మీకు... పస్తులు మాకు




పండగ మీకు... పస్తులు మాకు అంటూ అంగన్‌వాడీలు ఆదివారం ఖాళీ గిన్నెలతో వినూత్నంగా నిరసన తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల సమ్మె 34వ రోజూ కొనసాగింది. - వివరాలు 6లో

# కేజీహెచ్‌లో సోలార్ వెలుగులు

350 కేవీ సామర్థ్యంతో రెండు చోట్ల ప్యానెల్స్

- దాతలు, ప్రభుత్వం సహకారంతో ఏర్పాటు
- ప్రతి నెలా రూ.5 లక్షల విద్యుత్ బిల్లు ఆదా!

సీఎస్‌ఆర్ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్



**విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ బిల్లును ఆదా చేసేందుకు కేజీహెచ్ అధికారులుయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడంతో ప్రతినెలా సుమారు రూ.5 లక్షల వరకు ఆదా అవుతోంది. కాగా ప్యానెల్స్ ఏర్పాటుకు దాతలు సహకరించడంతో ఆ ఖర్చుకూడా మిగిలినట్టయింది.

కేజీహెచ్‌లో ప్రతినెలా కేవలం విద్యుత్ వినియోగానికి సుమారు రూ.45 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. సుమారు 30 విభాగాల్లో వైద్య సేవలు అందుతుండగా, 50కి పైగా భవనాల్లో 1,152 వార్డులు ఉన్నాయి. వీటిలో పదుల సంఖ్యలో ఏసీలు, వందలాది ఫ్యాన్లు నిత్యం వినియోగిస్తుంటారు. వీటితోపాటు ఆపరేషన్ థియేటర్, ఇతర విభాగాల్లో విద్యుత్ వినియోగం తప్పనిసరి. దీంతో కేజీహెచ్‌లో ప్రతిరోజూ వందలాది యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంటుంది. ఈ ... మిగతా 6వ పేజీలో

## పండగ పూటా విషాదం



కోటేశ్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

- గాలిపటం మాంజా దారం మెడకు తగిలి ఆర్మీ ఉద్యోగి మృతి
- హైదరాబాద్‌లో సంఘటన
- మృతుడు పెదవాల్తేరుకు చెందిన కోటేశ్‌రెడ్డి

**విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి):** ఒకరి పండగ సరదా మరొకరి నిండు ప్రాణం బలిగొంది. సంక్రాంతి సందడిలో ఎగరేసిన గాలిపటానికి కట్టిన ప్రమాదకరమైన మాజా దారం మెడకు తగలడంతో, రక్త నాళాలు తెగిపోయి ఆర్మీ ఉద్యోగి అక్కడికక్కడే మృతిచెందారు. ఈ దారుణం హైదరాబాద్‌లో శనివారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని పెదవాల్తేరు కాగితాలవీధి (నాగమయ్యపుట్ట) ప్రాంతానికి చెందిన కాగితాల కోటేశ్‌రెడ్డి (30) ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారు. నెల రోజుల కిందట అతనికి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయింది. ప్రస్తుతం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని తన సోదరుడి ఇంట్లో ఉంటున్నారు. శనివారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తన సోదరుడి నివాసానికి వెళుతుండగా ... మిగతా 6వ పేజీలో

# ఆటోనగర్‌పై హడావిడి!

## ఎన్నికల ముందు శంకుస్థాపనకు యత్నాలు

- కణమాంలో భూముల స్వాధీనానికి ఏపీఐఐసీ చర్యలు
- పరిహారం చెల్లించాలని పట్టుబడుతున్న రైతులు
- అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపణలు
- రైతుల ఎంపికలోనూ మతలబులు జరిగాయని విమర్శలు



ఆనందపురం మండలం కణమాంలో ఆటోనగర్‌కు కేటాయించిన స్థలం

**విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి):**

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆటోనగర్ శంకుస్థాపనకు అధికార పార్టీ హడావిడి చేస్తోంది. కోడ్ అమలులోకి రాకముందే ఆటోనగర్ నిర్మిస్తామని నమ్మబలికే ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆనందపురం మండలం కణమాంలో ఆటోనగర్‌కు సేకరించిన భూమిని స్వాధీనం చేసుకునేందుకు ఏపీఐఐసీ అధికారులను రంగంలోకి దింపింది. దీంతో పరిహారం అందని రైతుల్లో ఆందోళన నెలకొంది. పరిహారం చెల్లించాకే భూములు అప్పగిస్తామని వారు స్పష్టం చేయడంతో మీమాంసలో పడింది.

నగరంలోని తుక్కు దుకాణాలు, మెకానిక్‌షెడ్లు, వాహన బాడీలు నిర్మించే గ్యారేజీలు, అనుబంధ వ్యాపారుల కోసం ఆటోనగర్ నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా ఆనందపురం మండలం కణమాం గ్రామంలోని సర్వే నంబరు 50 కొండవాలు ప్రాంతంలో అధికారులు 157.77 ఎకరాలు సేకరించారు. ఇక్కడ పలువురు రైతులు ఏళ్లుగా తోటలు సాగుచేస్తున్నారు. వీరిలో 12 మందికి 23.367 ఎకరాల డి.పట్టా భూములున్నాయి. పట్టాలు లేకుండా 87 మంది ఆధీనంలో 92.387 ఎకరాలున్నట్టు రెవెన్యూ రికార్డులో ఉంది. రికార్డుల్లో లేకపోయినా 42.016 ఎకరాలను 70 మంది సాగుచేస్తున్నారు. దీంతో డీపట్టా రైతులకు ఎకరాకు రూ.47 లక్షలు, రెవెన్యూ రికార్డుల్లో నమోదైతే రూ.19 లక్షలు, రైతుల ఆధీనంలో ఉన్న భూములకు ఎకరాకు రూ.తొమ్మిది లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ మేరకు ఏపీఐఐసీ రూ.34 కోట్లను కలెక్టర్ పేరిట డిపాజిట్ చేసింది.

**ఆగస్టులోనే విజయోత్సవం**

ఆటోనగర్ విజయోత్సవం పేరిట వైసీపీ ప్రాంతీయ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గత ఏడాది ఆగస్టులో కార్యక్రమం నిర్వహించి, కొందరు రైతులకు పరిహారం అందజేశారు. వీరిలో 12 మంది డీపట్టా రైతులు, రెవెన్యూ రికార్డుల్లో భూములున్న 87 మందిలో సగం మంది ఉన్నారు. మిగిలిన వారికి ఇప్పటివరకు పరిహారం అందలేదు. అయితే ఆటోనగర్ లేఅవుట్‌లో సర్వే వివరాలను గత నెలలోనే వీఎంఆర్‌డీఏకు అధికారులు నివేదించారు. అనుమతి లభించే సమయంలో అధికారపార్టీ పెద్దలు అడ్డుపడినట్టు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ఆ భూములను సత్వరం స్వాధీనం చేసుకోవాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. దీంతో వారు ఇటీవల కణమాం వెళ్లి భూముల స్వాధీనానికి యత్నించారు. అయితే పరిహారం ఇచ్చిన తరువాతే భూములు స్వాధీనం చేసుకోవాలని రైతులు స్పష్టం చేయడంతో వెనుదిరిగారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఎన్నికల ముందు శంకుస్థాపన చేసేందుకు ఏపీఐఐసీ అధికారులు యత్నిస్తున్నారని, ఆ తరువాత పరిహారం ఇవ్వకపోతే తామంతా తీవ్రంగా నష్టపోతామని రైతులు ... మిగతా 6వ పేజీలో



## ఆర్టీసీకి సంక్రాంతి రద్దీ

**260 ప్రత్యేక బస్సులు నడిపిన అధికారులు**

**ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 14:** ఆర్టీసీకి సంక్రాంతి కాసులు కురిపించింది. గత వారం రోజులుగా ప్రత్యేక బస్సులు నడుపుతున్న అధికారులు ఆదివారం ప్రయాణికుల తాకిడి మరింత పెరగడంతో వివిధ ప్రాంతాలకు 260 సర్వీసులు నడిపారు. నగరంలో ఉంటున్న ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు, ఇతర ప్రాంతాల నుంచి వివిధ మార్గాల్లో ఇక్కడికి చేరుకున్న వారంతా స్వస్థలాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. దీంతో శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి, విజయనగరం బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, పాలకొండ, రాజమండి ప్రాంతాలకు నడుపుతున్న షెడ్యూల్ సర్వీసులు కిటకిటలాడాయి. ఈ నేపథ్యంలో శ్రీకాకుళానికి 50, పలాసకు 20, ఇచ్ఛాపురానికి 10, సోంపేటకు 15, టెక్కలి 5, పాతపట్నం 10, రాజాం 10, విజయనగరానికి 40, పార్వతీపురం 10, సాలూరు 15, బొబ్బిలి 15, పాలకొండ 10 ప్రత్యేక సర్వీసులు వెళ్లాయి. వీటితో పాటు దూర ప్రాంతాలైన రాజమండ్రికి 20, కాకినాడకు 15, అమలాపురానికి 10, విజయవాడ 5, నర్సీపట్నానికి 10 ప్రత్యేక సర్వీసులు నడిచాయి.



ప్రభుత్వ జీవోలను దహనం చేస్తున్న గండి బాబ్జీ



భోగిమంట వద్ద జనసేన పార్టీ ఇన్‌చార్జి ఉషాకిరణ్, నాయకులు

# భవిష్యత్తులో టీడీపీ, జనసేనకు అన్నీ శుభాలే..

- టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ
- భోగి మంటల్లో ప్రజా వ్యతిరేక జీవోలు దహనం

**మహారాణిపేట, జనవరి 14:** త్వరలో టీడీపీ, జనసేన పార్టీలకు అన్ని శుభాలేనని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయ ఆవరణలో భోగి మంటల వేసి ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు జీవో నెంబరు 512 కాపీలను దహనం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓడిపోతే, తొలుత జైలుకు వెళ్లేది జగన్‌నేనని అన్నారు. ప్రపంచంలో ఎవరిపైనా లేనన్ని కేసులు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై ఉన్నాయని,వీటిలో ఏ ఒక్క కేసులో శిక్ష ఖరారైనా పదేళ్ల జైలులో ఉండాల్సి ఉంటుందని టీడీపీ దక్షిణ నియోజకవర్గఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. అలాగే, జగన్ ముఖ్యమంత్రి కాక ముందు కోటి రూపాయలు కూడా లేవని, ఇప్పుడు వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యాయని ఆయన ప్రశ్నించారు.

**మురళీనగర్;** మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో కమిటీ ప్రెసిడెంట్ సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిపారు. ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు పాల్గొన్నారు. గాజువాక జెడ్పీ పొందూరు.సింహాచలం, వైసీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పేడాడ.రమణికుమారి తదితరులు పాల్గొన్నారు. పార్కు ప్రాంగణంలో భోగిమంటలు, సంక్రాంతి సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకలు జరిపారు. కాలనీ వాసులు పాల్గొన్నారు.

**ఎన్నికల తర్వాత మంచి రోజులు: జనసేన నేత ఉషాకిరణ్**

**సీతమ్మధార:** రానున్న ఎన్నికల తర్వాత జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీలకు పండగ రోజులేనని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. భోగి పర్వదినం సందర్భంగా ఉత్తర నియోజకవర్గం పరిధిలో భోగి మంటలు వేసి సంక్రాతి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఉషాకిరణ్ మాట్లాడుతూ రానున్న మూడు నెలల్లో జనసేన, తెలుగుదేశంఉమ్మడి ప్రభుత్వంలో మంచి రోజులు వస్తాయన్నారు. నాయకులు నీరుకొండ దివాకర్, మురళీకృష్ణ, అడబాల నాని, శ్రీనివాస్, వీరమహిళలు అడబాల లక్ష్మి, గోపి కళ్యాణం,పాల్గొన్నారు.

**పాత నగరంలో సందడి**

**పూర్ణామార్కెట్:**జగదాంబ దరి లేపాక్షి కుమ్మరవీధి, తాడివీధి, సాలిపేట, పాత పోస్టాఫీసు, ఏవీఎన్, పూర్ణామార్కెట్. దుర్గాలమ్మగుడి లక్ష్మీటాకీస్, ఇందిరా స్టేడియం రోడ్డు ప్రధాన కూడళ్ల వద్ద యువజన సంఘాలు, స్థానికులు భోగి మంటలను వేశారు. తెల్లవారుజామున భోగి మంటల వద్దకు వచ్చి పిల్లలు, పెద్దలు సంతోషంగా గడిపారు.

## వైసీపీ కార్యాలయంలో వేడుకలు

**సీతమ్మధార:** వైసీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయం వద్ద సమన్వయకర్త కేకేరాజు ఆధ్వ ర్యంలో భోగి మంట వేశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీ ష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్అనిల్‌కుమార్ రాజు, కేవీఎస్ శశికళ పాల్గొన్నారు.



భోగి మంటవేస్తున్న నాయకులు

## అన్ని వర్గాల్లోనూ అసంతృప్తే...: గంటా



భోగి మంట వేస్తున్న గంటా దంపతులు

**అక్కయ్యపాలెం:** నియోజకవర్గ టీడీపీ కార్యాలయ ఆవరణలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దంపతులు భోగి మంట వేశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలయికతో జయకేతనం ఎగురవేసి ప్రజలకు సుభిక్ష ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతృప్తి లేకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ పాలనకు త్వరలోనే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. గ్రేటర్ 46వ వార్డు శాంతినగర్‌లో యువకులు భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిూస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు స్థానికులకు భోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు దూది నరసింగరావు, సన్నిబాబు, రవి, కృష్ణ, శ్రీను, హేమంత్, రవీంద్ర, నాయుడు, శ్రీరా ములు, చైతన్య, వినయ్ పాల్గొన్నారు.

## భూ హక్కు చట్టం రద్దుచేయాలి

- భోగి మంటల్లో జీవో ప్రతులు దహనం



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

**మహారాణిపేట, జనవరి 14:** ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కుల చట్టం రద్దు చేయాలని కోరుతూ, న్యాయవాదులు భోగి మంటలు వేసి ఆ జీవో ప్రతులను వాటిలో వేసి దహనం చేశారు. కొద్దిరోజు లుగా భూ యాజ మాన్య హక్కు చట్టం జీవో 512ను రద్దు కోరుతూ విశాఖ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం శిబిరం ఎదుట భోగి మంట వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఏడాది అక్టోబరు 31వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన జీవో 512 భూ యాజమాన్య హక్కుల చట్టం ప్రజల కనీస హక్కును కాల రాస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ఆస్తి హక్కులనూ హరించి వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తులకు రక్షణ లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. ప్రజా వ్యతిరేకంగా ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు వురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## 25వేల ఉద్యోగాలు భర్తీ చేయాలి

- నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంతకుమార్



బొత్సకు వినతి పత్రం అందిస్తున్న హేమంతకుమార్

**అక్కయ్యపాలెం, జనవరి 14 :** కొవిడ్, ఇతర కారణాలతో జరిగిన ఉద్యోగాల భర్తీ అలస్యమైనందున, గత నాలుగేళ్లకు సంబంధించి 25 వేలకు తక్కువ కాకుండా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ డిమాండ్ చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా హేమంతకుమార్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత అనేక నిరసనల మేరకు మంత్రి బొత్స మెగా డీఎస్సీని సంక్రాంతి తర్వాత ఇవ్వనున్నట్టు ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. డీఎస్సీలో పీఈటీ అభ్యర్థులకు వ్యాయామ పరీక్ష రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం నిరుద్యోగులపై బనాయించిన కేసులన్నీ ఎత్తివేయాలన్నారు.లో ఉద్యోగ వయోపరిమితి జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థులకు ఐదు గ్రేస్ మార్కులు వేయాలన్నారు. ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన ప్రకారం పోలీస్ శాఖలో 26 వేల ఉద్యోగాలు భర్తీచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కనకమహాలక్ష్మి ఆలయంలో సంక్రాంతి సందడి



ఆలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఈవో శిరీష, భక్తులు

**జగదాంబ కూడలి, జనవరి 14:** వన్‌టౌన్ కనకమహాలక్ష్మి ఆలయంలో సంక్రాంతి సందడి నెలకుంది. ఆదివారం ఈవో కె.శిరీష ఆధ్వర్యంలో భోగి పండుగను మహిళలు, పిల్లల సమక్షంలో సంప్రదాయబద్ధంగా జరిపారు. ఆలయ ప్రాంగణాన్ని పల్లెను తలపించే రీతిలో రంగుల ముగ్గులు, గొబ్బిళ్లు, రైతు, పంటలు, తాటాకు పూరిల్లుతో అలంకరించారు. హరిదాసులు, గంగిరెద్దుల మేళం, పిల్లలు గోదాదేవి వేషధారణలు, మహిళలు కోలాటంతో ఏర్పాటుచేశారు. ఈవో శిరీష దంపతులు చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. ఉదయం జరిగిన పంచామృతాభిషేకం సేవల్లో వంద మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

## నేటి నుంచి క్రికెట్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 14:** ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా వచ్చే నెల2వ తేదీ నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగే అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పేటీఎం ఇన్‌సైడర్.ఇన్ వెబ్‌సైట్‌లో ఉదయం 11.00 గంటల నుంచి టికెట్లు విక్రయించనున్నారు. ఐదు రోజులపాటు జరిగిఏ ఈ టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించి టికెట్ల ధరలను రెండు రకాలుగా నిర్ణయించారు. ఒక రోజు ఆట వీక్షించేందుకు రోజువారీ టికెట్లకు ఒక ధర, మ్యాచ్ మొత్తం ఐదు రోజుల ఆట తిలకించేందుకు మరొక ధర టికెట్లను అందుబాటులో ఉంచనున్నారు. ఒక రోజు ఆట వీక్షణకు సంబంధించి రోజువారీ టికెట్ ధరలు; రూ.100, రూ.200, రూ.300, రూ.500 కాగా...ఐదు రోజుల ఆట (మ్యాచ్ మొత్తం) వీక్షణకు టికెట్ ధరలు; రూ.400, రూ.800, రూ.1,000, రూ.1500. ఈనెల 26 నుంచి నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, ఏసీఏ వీడీసీఏ స్టేడియం కేంద్రాలుగా ఆఫ్‌లైన్‌లో టికెట్లు విక్రయాలు చేపట్టనున్నారు.

## కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

**సిరిపురం, జనవరి 14 :** అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. ఆదివారం వారు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఖాళీ కంచాలను మోత మోగిస్తూ పండగ పూట పస్తులు మాకు పండుగ మీకా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారికి సీపీఎం కార్పొరేటర్ బి. గంగారావు, బొట్టా ఈశ్వరమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎం శ్రీనివాస్, ఆర్కేఎస్వీ కుమార్, పి. వెంకటరెడ్డి, వి. కృష్ణారావు, ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అంగన్‌వాడీలపై అతి దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. యూనియన్ నాయకులు తులసి, వెంకటలక్ష్మి, నాగేశ్వరి, శోభ, కృప, శాంతి, సుజాతఉన్నారు.

## 18న 'డయల్ యువర్ సీపీ'

**మహారాణిపేట:** పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఈనెల 15 వతేదీన నిర్వహించనున్న డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని ఈ నెల 18 వ తేదీకి మార్పు చేసినట్టు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 12 వరకు ఫోన్‌లో పిర్యాదు స్వీకరిస్తారన్నారు.

# సింహగిరిపై వైభవంగా సంక్రాంతి సంబరాలు

**సింహాచలం, జనవరి 14 :** సింహగిరిపై సంక్రాంతి పురస్కరించుకుని పల్లె వాతావరణాన్ని ఆవిష్కరించారు. ఆదివారం వేకువజాము నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన గ్రామీణ ప్రజలు, రైతులతో సందడి నెలకొంది. భక్తుల ఆనందోత్సాహాల నడుమ భోగి మంట వెలిగించడం ద్వారా విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, సింహాచలం ఈఓ శ్రీనివాసమూర్తి, పాలక మండలి సభ్యులు ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. భోగి మంటల చుట్టూ హరిదాసు, జంగమదేవరలు భజనలు చేస్తూ ప్రదక్షిణంగా తిరిగారు. అనంతరం మహిళలు కొత్త బియ్యంతో పరమాన్నం తయారు చేసి పంపిణీ చేశారు. దేవాలయ మాడవీధుల్లో ప్రధాన రాజగోపురానికి ఎదురుగా పలువురు మహిళలు రంగవల్లులగా శోభాయమానంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో దేవాలయ డిప్యూటీ ఈఓ సుజాత, ఏఈవో లు భ్రమరాంబ, రమణమూర్తి, ఈఈ బండారు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్వరూపానంద, స్వాత్మానందేంద్ర సరస్వతి



ధాన్యాన్ని కుండలో నింపుతున్న యువతులు

# బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

**వేపగుంట, జనవరి 14:** ఇక్కడి అప్పన్నపాలెం బీఆర్‌టీఎస్ సెంటర్ రోడ్డులో బస్సు ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందారు.ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో రోడ్డు దాటుతున్న గొలగాని అప్పలకొండ (48) అనే మహిళను సింహాచలం నుంచి వేపగుంట వెళ్తున్న 68కే నంబర్ గల బస్సు బలంగా ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అప్పలకొండ భర్త అప్పారావు, ఇద్దరు పిల్లలతో అప్పన్నపాలెంలో ఉంటున్నారు. కూలి పనులు చేసుకునే భర్త అనారోగ్యం కారణంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబాన్ని పోషించేందుకు అప్పలకొండ ఓ అపార్ట్‌మెంటులో ఇంటి పనులు చేస్తుంది. రోజూ మాదిరిగానే ఉదయం తొమ్మిది గంటలప్పుడు ఆమె రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్ వేగంగా వాహనం నడపడమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పట్నం.. పల్లెబాట!

... 5వ పేజీ తరువాయి

శనివారం రాత్రే స్వస్థలాలకు వెళ్లగా, మిగిలిన కొద్దిమంది భోగి పండగను ఇక్కడే జరుపుకుని ఆదివారం ఉదయం పయనమయ్యారు. ఈనేపథ్యంలో అనకాపల్లి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం మార్గాల్లో వాహనాల రద్దీ కనిపించింది. కాగా అటువైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ట్రాఫిక్ కనిపించలేదు. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి నగరం బోసిపోయింది. జగదాంబజంక్షన్, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, సత్యం కూడలి, మద్దిలపాలెం జంక్షన్, హనుమంతవాక కూడలి, వెంకోజీపాలెం, ఇసుకతోట, ఎంవీపీకాలనీ, గాజువాక వంటి ప్రధాన కూడళ్లు కళావిహీనంగా కనిపించాయి. సిటీబసుల్లో ఇద్దరు, ముగ్గురికి మించి ప్రయాణికులు లేరు. కాగా బీచ్‌లో కొంతమంది పతంగులు ఎగరవేసుకుని చీకటిపడేసరికి తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. పండగ ముగిసే వరకు నగరంలో ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది.

# ఏయూ వీసీ పోస్టుపై వీడని సస్పెన్స్

... 5వ పేజీ తరువాయి

నివేదికలో తాజా మాజీ వీసీ ప్రసాదరెడ్డి, మాజీ రిజిస్ట్రార్, ప్రస్తుత ఓఎస్‌డీ కృష్ణమోహన్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహనరావు పేర్లు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురూ ఎవరి మార్గాల్లో వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడం ప్రచారానికి ఊతమిచ్చింది. మాజీ వీసీ ప్రసాదరెడ్డి ఇప్పటికే ఉమ్మడి జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకుని, మళ్లీ వీసీగా వచ్చేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారని సమాచారం. మరో వైపు ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ రామ్మోహనరావు తనకున్న రాజకీయ పరిచయాలతో ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలిసింది.

**ఝాన్సీ రాకతో మారిన పరిణామాలు..**

కాగా వీసీ ఎంపికలో తాజాగా ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. సెర్చ్ కమిటీ ముగ్గురి పేర్లతో ప్రభుత్వానికి అందించిన నివేదికలో ఒకరి పేరును ఆదినుంచీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పుడు ఆయన సతీమణి ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీ అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఇదే ఇప్పుడు మాజీ వీసీకి ఇబ్బందికరంగా పరిణమించిందని చెబుతున్నారు. తాజా మాజీ వీసీకి మళ్లీ అవకాశం కల్పిస్తే రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయని మంత్రిభావిస్తున్నారని, ఝాన్సీ ఎంపీగా బరిలోకి దిగుతుండడంతో వీసీ నియామకంపై మంత్రి మరింతగా దృష్టిసారించే అవకాశముందంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ వీసీకి దాదాపు దారులు మూసుకుపోయినట్టేనంటున్నారు. మిగిలిన ఇద్దరిలో ఒకరికి ఎంపీ స్థానానికి ఖరారైన బొత్స ఝాన్సీ లక్ష్మితో పరిచయం ఉందని, ఆమె ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

**సంక్రాంతి తరువాతే...**

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంక్రాంతి తరువాత ఏయూ వీసీ పోస్టు భర్తీపై సస్పెన్స్‌కు తెరపడుతుందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రాకముందే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏయూ అధికారులు భావిస్తున్నారు. సెర్చ్ కమిటీ నివేదికలోని ముగ్గురిలో ఒకరికి కాకుండా, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తే మాత్రం వీసీ నియామక ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చే అవకాశముందంటున్నారు. ఎన్నికల తరువాత ప్రక్రియ చేపట్టాలని భావిస్తే ప్రస్తుత ఇన్‌చార్జి వీసీనే కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. మొత్తమ్మీద వీసీ ఎంపిక ప్రక్రియపై సంక్రాంతి తరువాతే స్పష్టత వచ్చే అవకాశముందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

# కేజీహెచ్‌లో సోలార్ వెలుగులు

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో విద్యుత్ ఖర్చును తగ్గించుకునేందుకు అధికారులు యత్నించారు. ఇందులో భాగంగా సీఎస్ఆర్ బ్లాక్ భవనంపై ఆర్ఎస్ఆర్ మిట్టల్ సంస్థ సహకారంతో ఐదు నెలల కిందట 120 కేవీ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుచేశారు. దీనికి సుమారు రూ.80 లక్షలు సంస్థ అందించింది. సూపర్ స్పెషాలిటీ బ్లాక్, కేజీహెచ్ ఆర్థో విభాగం భవనాలపైన మరో 230 కేవీ సామర్థ్యం కలిగిన ప్యానెల్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తంగా 350 కేవీ సామర్థ్యం కలిగిన ప్యానెల్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటి నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో నెలకు సుమారు రూ.5 లక్షల వరకు విద్యుత్ ఖర్చు తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు. నాడు-నేడులో భాగంగా చేపట్టనున్న భవన నిర్మాణాలు పూర్తయితే వాటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకుయత్నిస్తున్నారు. ఇందుకోసం పలువురు దాతలు ముందుకు వచ్చారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.

**మిగులు మొత్తంతో ఇతర అవసరాలు**

ప్రతి నెలా విద్యుత్ బిల్లులో మిగులు మొత్తాన్ని ఆస్పత్రిలో ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఏడాదికి రూ.60 లక్షల వరకు మిగులుతోందని, దీనిని మౌలిక వసతుల కల్పన, విభాగాల అభివృద్ధి, పరికరాల కొనుగోలుకు వినియోగిస్తున్నామన్నారు.

**ప్యానెల్స్ సామర్థ్యం పెంచేలా...**

ప్రస్తుత సోలార్ ప్యానెల్స్‌తో సూపర్ స్పెషాలిటీ, సీఎస్ఆర్ బ్లాక్‌లకు అవసరమైన విద్యుత్ సరఫరా అవుతోంది. మిగిలిన విభాగాలు, ఓపీ భవనాలకు విద్యుత్‌ను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం దాతల సహకారాన్ని కోరుతున్నారు.

# పండగ పూటా విషాదం

... 5వ పేజీ తరువాయి

మెహదీపట్నంలోని లంగర్‌హౌస్ ఫ్లైఓవర్ దిగుతుండగా గాలిపటం మాంజా దారం అతని మెడకు తగిలింది. దీంతో మెడ నరాలు తెగిపోయాయి. తీవ్ర రక్తస్రావంతో కింద పడిపోయిన అతను అక్కడిక్కడే మృతిచెందారు. ప్రమాదకరమైన మాంజాను వినియోగించడమే దీనికి కారణమని తెలిసింది.

కోటేశ్‌రెడ్డికి రెండున్నరేళ్ల కిందట మద్దిలపాలేనికి చెందిన ప్రత్యూషతో వివాహమయింది. వీరికి ఏడాది వయసున్న కుమార్తె భువిక ఉంది. ఇటీవలే హైదరాబాద్‌కు బదిలీ కావడంతో అద్దె ఇల్లు తీసుకునేవరకూ భార్య, కుమార్తెను నగరంలోనే ఉంచి, సోదరుడి ఇంట్లో ఉంటున్నారు. కాగా కోటేశ్‌రెడ్డి మృతదేహాన్ని ఆదివారం రాత్రికి నగరానికి తీసుకువచ్చే అవకాశం ఉంది. సైనిక లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు మృతుడి స్నేహితుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ దారుణ ఘటనతో పండగ పూటా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# ఆటోనగర్‌పై హడావిడి!

... 5వ పేజీ తరువాయి

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భూసేకరణలో మతలబులు?**

భూముల సేకరణ సమయంలోనే మతలబులు జరిగాయని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలు ఏకమై భూముల క్లాసిఫికేషన్ మార్పు చేసి లబ్ధిపొందారన్న ఆరోపణలున్నాయి. ఉదాహరణకు రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములను కేవలం రైతుల ఆధీనంలో ఉన్నాయని మార్చారంటున్నారు. ఏళ్లుగా తోటలు పెంచుకుని జీవిస్తున్న వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ భూముల్లో కొంతవిస్తీర్ణాన్ని ఇతరుల పేరిట నమోదు చేయించారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఆటోనగర్‌కు భూములు ఇచ్చిన రైతుల సమక్షంలోనే బహిరంగ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

## 'ముస్లింలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలి'

**అక్కయ్యపాలెం, జనవరి 14 :** వచ్చే ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యం కల్పించి ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ కమిటీ రాజకీయ పార్టీలనుంచి డిమాండ్ చేసింది. రైల్వే న్యూకాలనీలోనిఓ హోటల్‌లో ఆదివారం ముస్లిం నేత హైదరాలి సింకా అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులుమాట్లాడుతూ ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని వాపోయారు. నాయకులు షేక్ షరీఫ్,హైదరాలిసింకా, బండ్‌మునీర్, అమీర్‌జాన్, అహ్మద్‌వల్లి,మునీర్‌ఖాన్ ఉన్నారు.



రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

## సింహాచలం రైల్వే స్టేషన్ కిటకిట

**గోపాలపట్నం, జనవరి 14:** సంక్రాంతి పండగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో సింహాచలం రైల్వే స్టేషన్ ఆదివారం కిక్కిరిసిపోయింది. ఉదయం ఐదు గంటల నుంచి సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికుల రద్దీ కనిపించింది. విశాఖ-విజయనగరం, విశాఖ-రాయగడ, విశాఖ-పలాస పాసింజర్ రైళ్లతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అసాధారణమైన రద్దీ నెలకొంది. సాధారణ రోజులతో పోలిస్తే సుమారు మూడింతల మంది ప్రయాణికులు స్టేషన్‌కు అధికంగా వచ్చారు. ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాకు చెందిన వేలాది మంది తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు స్టేషన్‌కు రావడంతో పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. సుమారు 15 వేల మందికి పైగా ప్రయాణికులు ఆదివారం ఉదయం స్టేషన్‌కు వచ్చినట్టు అంచానా. రైలు ప్లాట్‌ఫారమ్‌కు వచ్చే సమయానికి దానిని ఎక్కేందుకు ప్రయాణికులు బారులుతీరారు.

## గోల్డ్ మెడల్ విజేతకు సీఎండీ అభినందన



గోపాల్‌ను అభినందిస్తున్న ఉక్కు సీఎండీ అతుల్‌భట్

**ఉక్కుటౌన్‌షిప్, జనవరి 14:** మార్కెటింగ్ విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించిన స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం సీనియర్ మేనేజర్ ఎం.గోపాల్‌ను సీఎండీ అతుల్‌భట్ ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ మార్కెటింగ్‌లో అవార్డు సాధించడం గొప్ప విషయమని, భవిష్యత్తులో గోపాల్ మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎస్.బలరాం, జనరల్ ఫోర్‌మెన్ జి.ఆనంద్ పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**మల్కాపురం, జనవరి 14:** జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు 'మన ఊరు-మన ఆట' కార్యక్రమంలో భాగంగా పార్టీ వార్డు అధ్యక్షుడు ముప్పిన ధర్మేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. సుమారు 45 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొనగా, విజేతలుగా నిలిచిన ఐదుగురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి, నాయకులు పీలా రామకృష్ణ, త్రివేణి, నాగలక్ష్మి, కిరణ్‌ప్రసాద్, మంజునాథ్, బద్రీ, తదితరులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యం'



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు వేస్తున్న ముత్యాలు

**గాజువాక, జనవరి 14:** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. గాజువాకలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ వల్ల ప్రజలు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసీపీ దుర్మార్గ పాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన పలువురికి కండువాలు వేశారు. కార్యక్రమంలో నాయకులు భూలోక, రాంబాబు, అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 17, క్యారెట్ 32, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 76, బరబాటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 32, ఆగాకర 84, పొటల్స్ 62, కీర దోస 24, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 599 |
| విజయనగరం | 603 |
| శ్రీకాకుళం | 603 |

### చికెన్ ధరలు

బ్రాయిలర్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 100 |
| ఫారం ధర | -- | 120 |
| విత్ స్కిన్ | -- | 210 |
| స్కిన్‌లెస్ | -- | 220 |



గాజువాకలో వేసిన భోగి మంట వద్ద బీజేపీ నేత కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు



శారదా పీఠంలో భోగి మంట వద్ద స్వరూపానందేంద్ర సరస్వతి, తదితరులు



గోపాలపట్నంలో భోగి మంట వద్ద చిన్నారులు, పెద్దలు

# సందడిగా భోగి పండగ

**గాజువాక, జనవరి 14:** పారిశ్రామిక ప్రాంతంలో భోగ పండగను ఆదివారం ప్రజలంతా ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. వేకువజామునే ప్రధాన కూడళ్లు, వీధులతో పాటు అపార్టుమెంట్లలోని ఖాళీ ప్రదేశాల్లో భోగి మంటలు వేసి చిన్నారులు, పెద్దలు ఆటపాటలతో సందడి చేశారు. చాలామంది తమ ఇళ్లలోని పాత సామాన్లను భోగి మంటల్లో వేసి చలి కాచుకున్నారు. పలుచోట్ల భోగి మంటల్లో వేడి నీళ్లు మరిగించి చిన్నారులకు స్నానాలు చేయించారు. పలువురు భోగి మంటల వల్ల చెరకు గడలను అందంగా అమర్చి, రంగురంగుల ముగ్గులు వేశారు.

**గోపాలపట్నం:** భోగి మంటలను గోపాలపట్నంలోని అన్ని ప్రాంతాల్లో వేశారు. పలు వీధుల్లో యువకులు రహదారులపై పెద్దఎత్తుల భోగి మంటలు పరిసర ప్రాంతాల ప్రజలంతా చేరుకుని ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. పలు ఇళ్ల ముంగిట వేసిన రంగవల్లులు ఆకర్షణీయంగా ఉన్నాయి.

**పెదగంట్యాడ:** టీడీపీ మండల కార్యాలయ ఆవరణలో నాయకులు, కార్యకర్తలు భోగి మంటలు వేసి పలు జీవోల నకళ్లను దహనం చేశారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు పి.సోమునాయుడు, నమ్మి అప్పారావు, డి.పెరుమాళ్లు, ఎం.పెంటయ్య, ఎ.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**కూర్మన్నపాలెం:** టీడీపీ 87వ వార్డు కార్యాలయం వద్ద భోగి మంట జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీప-జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. నాయకులు బొండా లక్ష్మి, బి.అప్పలనాయుడు, ఎస్.సూర్యారావు, బి.చినఅప్పలనాయుడు, కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**అక్కిరెడ్డిపాలెం:** జీవీఎంసీ 68, 69 వార్డుల పరిధిలోని మింది, అక్కిరెడ్డిపాలెం, తుంగ్లాం, హరిజన జగ్గయ్యపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో వేకువజామునే ప్రజలు భోగి మంటలు ఉత్సాహంగా గడిపారు. అక్కిరెడ్డిపాలెం కాలనీలో యువకులు సంక్రాంతిని పురస్కరించుకుని క్రికెట్ పోటీలు నిర్వహించగా, బీహెచ్‌పీవీలో ఉద్యోగుల పిల్లలు క్రికెట్ పోటీలను నిర్వహించారు. నాతయ్యపాలెంలో మహిళలకు ముగ్గుల పోటీలు చేపట్టారు.

**అగనంపూడి:** గ్రేటర్ 79, 85వ వార్డుల పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లో తెల్లవారుజామున భోగి మంటలు వేసి స్థానికులు సందడి చేశారు. స్థానిక జాబిలి హిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు భోగి మంటలు వేయడంతో పాటు రంగవల్లులు వేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ 79వ వార్డు అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవాని, అసోసియేషన్ ప్రతినిధులు రామారావు, వీరునాయుడు, శంకరరావు, జయ, హేమ, తదితరులు పాల్గొన్నారు.

**పెందుర్తి:** పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్‌లలో పలు కాలనీల ప్రజలు, అపార్ట్‌మెంట్ వాసులు సామూహికంగా భోగి మంటలు వేసి సందడి చేశారు. పలువురు చిన్నారులు భోగి మంటల్లో పిడకలు వేశారు. కరకవానిపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు ఆధ్వర్యంలో పార్టీ మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, తదితరులు ప్రజా వ్యతిరేక జీవీల ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. వెంకటాద్రి ఆలయంలో శ్రీవారి సేవకులు ఆధ్వర్యంలో భక్తులు భోగి మంటలు వేశారు. చినముషిడివాడలోని శారదాపీఠంలో సంప్రదయకంగా భోగి పండగను జరిపారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి భోగి మంటలకు పూజలు చేశారు. శంకరాచార్య వేద పాఠశాల విద్యార్థులు, సిబ్బంది మంటల్లో పిడకలు వేశారు.

# కమనీయం గోదా శ్రీనివాసుని కల్యాణం

**అక్కిరెడ్డిపాలెం, జనవరి 14:** బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన గోదా శ్రీనివాసుని కల్యాణం భక్తులను తన్మయత్వానికి గురి చేసింది. కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై గోదా శ్రీనివాసులను ఆశీనులను చేసి అర్చకులు హైందవ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా కల్యాణాన్ని జరిపారు. పాలక మండలి చైర్మన్ గండ్రెడ్డి రామునాయుడుతో పాటు సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు. షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అర్చకులు గోదా శ్రీనివాసుని కల్యాణాన్ని ఘనంగా జరిపారు. పూజాది కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఎస్టీబీఎల్ బాలాజీ దివ్యక్షేత్రంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**పెందుర్తి:** ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదా రంగనాథస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.ం సుదర్శన కల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అలంకార భూషితుడైన రంగనాథస్వామి చెంతన గోదాదేవిని అర్చకులు ఆసీనులు గావించారు. ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యులు పర్యవేక్షణలో రుత్వికులు వేద మంత్రాలు పఠిస్తుండగా శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. పరిణయ ఘట్టాలను వివరిస్తూ నిర్వహించిన స్వరార్చన భక్తులను అలరించింది. 508 మంది దంపతులు గోదాదేవి కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని వీక్షించారు.

**అగనంపూడి:** జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనురాసోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు సత్యనారాయణ గోదా రంగనాథుల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాగణంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను అమితంగా ఆకట్టుకుంది. నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**వేపగుంట/ఎన్ఏడీ:** నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెళ్లి కావాల్సిన పురుషులు, యువతుల తల్లిదండ్రులు 60 మంది పాల్గొని పూజలు చేయగా, వారికి కల్యాణం అక్షితలు, ప్రసాదాలను అందజేశారు. ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. వేపగుంట బీసీ కాలనీలోని వేంకటేశ్వరాలయంలో, శ్రీలక్ష్మీనరసింహనగర్ గోపిజనవల్లభస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని జరిపారు. అదేవిధంగా 90వ వార్డు విమాన్‌నగర్‌లోని వైకుంఠ వేంకటేశ్వరాలయంలోనూ గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

# రాంపురంలో వైసీపీ నేత గెడ్డ ఆక్రమణ

**ఉప సర్పంచ్ ఫిర్యాదుతో వెలుగులోకి..**

**అక్రమ కట్టడాన్ని కూల్చిన అధికారులు**

**పెందుర్తి, జనవరి 14:** పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సొంత గ్రామం రాంపురం.. ఆయన సతీమణి గ్రామ సర్పంచ్‌గా ఉన్నచోటే స్థానిక వైసీపీ నాయకుడు ప్రభుత్వ గెడ్డ స్థలాన్ని ఆక్రమించాడు. ఎమ్మెల్యే అండదండలతో గెడ్డ స్థలాన్ని ఆక్రమించి, చదును చేసి ప్రహరీ నిర్మాణం చేశారంటూ గ్రామ వైసీపీ మద్దతుదారు ఉప సర్పంచ్, వైసీపీ ఎంపీటీసీ భర్త రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఓ వైసీపీ నాయకుని ఆక్రమణను ఆ పార్టీకి చెందిన వారే గుట్టురట్టు చేయడం గమనార్హం. ఉప సర్పంచ్ కిశోర్, ఎంపీటీసీ గండి హిమబిందు భర్త భూషణరావు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంపురంలో సర్వే నంబర్-30లో 1.27 ఎకరాల్లో 29-1లో 0.13 సెంట్ల ప్రభుత్వ గెడ్డ స్థలం ఉంది. తమ వ్యవసాయ పనుల కోసం కొంతమంది రైతులు ఇందులోని కొంత స్థలాన్ని ఏళ్లతరబడి రహదారిగా వినియోగిస్తున్నారు. అయితే విలువైన ఈ గెడ్డ స్థలంపై స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు, వైసీపీ నాయకుడు ఎర్నినాయుడు కన్ను పడింది. దీంతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి స్థలాన్ని జిరాయితీగా పేర్కొంటూ రెండు సర్వే నంబర్లలో గల సుమారు 15 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి చదును చేయడమే కాకుండా ప్రహరీ నిర్మించినట్టు కిశోర్ తెలిపారు. ఈ ఆక్రమణను అడ్డుకుంటే ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరిస్తున్నారని ఆరోపించారు.

### ఆక్రమిత స్థలం స్వాధీనం

రాంపురంలో వైసీపీ నాయకుని ఆక్రమణ విషయాన్ని విలేకరులకు తెలిపారన్న సమాచారంతో ఆదివారం పెందుర్తి తహసీల్దార్ సిబ్బంది ఆర్ఐ సాయి, వీఆర్వో వరహాలు హడావుడిగా గ్రామానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ప్రహరీని తొలిగించి, ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరికి బోర్డు పెట్టారు. ఆక్రమణదారునిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీల మండిపాటు

**దీక్షా శిబిరం వద్ద ప్రభుత్వ జీవో ప్రతులు దహనం**

**పెందుర్తి, జనవరి 14:** తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే సమ్మె చట్ట విరుద్ధమంటూ ప్రభుత్వం నోటీసులు జారీ చేసి ఎస్మా చట్టంతో భయపెట్టాలని చూస్తుందని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మండిపడ్డారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా భోగి పండగను పురస్కరించుకుని ఆది వారం శిబిరం వద్దే మంట వేసి ప్రభుత్వం జారీ చేసిన ప్రతులను దహనం చేశారు. జీవో ప్రతులతో కార్మిక చట్టాలను వైసీపీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. నిరంకుశ ప్రభుత్వాన్ని తరిమికొడతామని హెచ్చరించారు. తొలుత దీక్షా శిబిరం వద్ద పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రతినిధులు ఆర్.అనిత, బృంద, అంగన్‌వాడీల మండల శాఖ ప్రతినిధులు దేవి, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



జీవో ప్రతులను దహనం చేసి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



విద్యుద్దీప కాంతుల్లో ఆలయం

## నేడు అయ్యప్ప ఆలయంలో మకర జ్యోతి దర్శనం

**ఉక్కుటౌన్‌షిప్, జనవరి 14:** స్టీల్‌ప్లాంట్ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మకరజ్యోతి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించనున్నారు. ఆలయం వెనక గల కొండపై సాయంత్రం మకరజ్యోతి దర్శనానికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి హోమంతో పాటు ప్రత్యేక పూజలు జరపనున్నారు. మకర జ్యోతి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

## ఉక్కులో బయోమెట్రిక్ మెషిన్లు

**ఉక్కుటౌన్‌షిప్, జనవరి 14:** స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కోసం కర్మాగారం లోపల బయోమెట్రిక్ మెషిన్లను ఏర్పాటు చేశారు. ఉద్యోగుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని యాజమాన్యం రెండేళ్ల క్రితం నిర్ణయించింది. దీంతో ప్లాంట్ బయట ఆస్పత్రి, టౌన్ అడ్మిన్ విభాగం, పరిపాలన విభాగం, ఆగ్రో ఫారెస్టు, ఆడిటింగ్, సీఎస్ఆర్ విభాగాల్లో ఈ విధానాన్ని అమలులోకి తెచ్చారు. అయితే ఇప్పుడు ప్లాంట్ లోపల కూడా ఏర్పాటు చేయాలని యాజమాన్యం సన్నాహాలు చేస్తుంది. తొలి విడత జనరల్ షిఫ్టులలో, ఆ తర్వాత సర్వీసు, ప్రొడక్షన్ విభాగాల్లో అమలు చేయనున్నారు. ఇప్పటికే ప్లాంట్‌లో 70 బయోమెట్రిక్ మెషిన్లను ఏర్పాటు చేయగా, త్వరలో మరో 400 మెషిన్లను ఏర్పాటు చేయనున్నారు.

## కార్మికుల సంక్షేమమే సంఘాల ధ్యేయం

**గాజువాక, జనవరి 14:** కార్మిక సంఘాలు ఎన్ని ఉన్నా వాటి అంతిమ లక్ష్యం కార్మిక సంక్షేమమేనని ఇంటక్ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. పంతులుగారి మేడ వద్ద ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణతో కేవలం ఉక్కు ఉద్యోగులు, కార్మికులకే నష్టం వాటిల్లదని, ఇది విశాఖ భవిష్యత్తుకు ప్రమాదమన్నారు. ఇప్పటికైనా కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, జిందాల్‌తో చేసుకున్న ఎంవోయూను రద్దు చేసుకోవాలని, నూతన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బి.నాగ భూషణం, ఉరుకూటి బాబూరావు, చిన్నారావు రెడ్డి, ఎంకే కొండబాబు, నరసింగరావు, సీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జీవోలను దహనం చేస్తున్న గండి బాబ్జీ



భోగిమంట వద్ద జనసేన పార్టీ ఇన్‌చార్జి ఉషాకిరణ్, నాయకులు

# భవిష్యత్తులో టీడీపీ, జనసేనకు అన్నీ శుభాలే..

- టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ
- భోగి మంటల్లో ప్రజా వ్యతిరేక జీవోలు దహనం

**మహారాణిపేట, జనవరి 14:** త్వరలో టీడీపీ, జనసేన పార్టీలకు అన్ని శుభాలేనని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయ ఆవరణలో భోగి మంటల వేసి ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు జీవో నెంబరు 512 కాపీలను దహనం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓడిపోతే, తొలుత జైలుకు వెళ్లేది జగన్‌నేనని అన్నారు. ప్రపంచంలో ఎవరిపైనా లేనన్ని కేసులు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై ఉన్నాయని,వీటిలో ఏ ఒక్క కేసులో శిక్ష ఖరారైనా పదేళ్లు జైలులో ఉండాల్సి ఉంటుందని టీడీపీ దక్షిణ నియోజకవర్గఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. అలాగే, జగన్ ముఖ్యమంత్రి కాకముందు కోటి రూపాయలు కూడా లేవని, ఇప్పుడు వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యాయని ఆయన ప్రశ్నించారు.

**మురళీనగర్;** మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో కమిటీ ప్రెసిడెంట్ సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిపారు. ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు పాల్గొన్నారు. గాజువాక జెడ్పీ పొందూరు.సింహాచలం, వైసీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పేడాడ.రమణికుమారి తదితరులు పాల్గొన్నారు. పార్కు ప్రాంగణంలో భోగిమంటలు, సంక్రాంతి సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకలు జరిపారు. కాలనీ వాసులు పాల్గొన్నారు.

**ఎన్నికల తర్వాత మంచి రోజులు: జనసేన నేత ఉషాకిరణ్**

**సీతమ్మధార:** రానున్న ఎన్నికల తర్వాత జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీలకు పండగ రోజులేనని జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. భోగి పర్వదినం సందర్భంగా ఉత్తర నియోజకవర్గం పరిధిలో భోగి మంటలు వేసి సంక్రాతి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఉషాకిరణ్ మాట్లాడుతూ రానున్న మూడు నెలల్లో జనసేన, తెలుగుదేశంఉమ్మడి ప్రభుత్వంలో మంచి రోజులు వస్తాయన్నారు. నాయకులు నీరుకొండ దివాకర్, మురళీకృష్ణ, అడబాల నాని, శ్రీనివాస్, వీరమహిళలు అడబాల లక్ష్మి, గోపి కళ్యాణం,పాల్గొన్నారు.

**పాత నగరంలో సందడి**

**పూర్ణామార్కెట్:**జగదాంబ దరి లేపాక్షి కుమ్మరవీధి, తాడివీధి, సాలిపేట, పాత పోస్టాఫీసు, ఏవీఎన్, పూర్ణామార్కెట్, దుర్గాలమ్మగుడి లక్ష్మీటాకీస్, ఇందిరా స్టేడియం రోడ్డు ప్రధాన కూడళ్ల వద్ద యువజన సంఘాలు, స్థానికులు భోగి మంటలను వేశారు. తెల్లవారుజామున భోగి మంటల వద్దకు వచ్చి పిల్లలు, పెద్దలు సంతోషంగా గడిపారు.

**వైసీపీ కార్యాలయంలో వేడుకలు**

**సీతమ్మధార:** వైసీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయం వద్ద సమన్వయకర్త కేకేరాజు ఆధ్వ ర్యంలో భోగి మంట వేశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీ ష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్‌అనిల్‌కుమార్ రాజు, కేవీఎస్ శశికళ పాల్గొన్నారు.



భోగి మంటవేస్తున్న నాయకులు

## అన్ని వర్గాల్లోనూ అసంతృప్తే...: గంటా



భోగి మంట వేస్తున్న గంటా దంపతులు

**అక్కయ్యపాలెం:** నియోజకవర్గ టీడీపీ కార్యాలయ ఆవరణలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దంపతులు భోగి మంట వేశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలయికతో జయకేతనం ఎగురవేసి ప్రజలకు సుభిక్ష ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతృప్తి లేకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ పాలనకు త్వరలోనే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. గ్రేటర్ 46వ వార్డు శాంతినగర్‌లో యువకులు భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు స్థానికులకు భోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు దూది నరసింగరావు, సన్నిబాబు, రవి, కృష్ణ, శ్రీను, హేమంత్, రవీంద్ర, నాయుడు, శ్రీరా ములు, చైతన్య, వినయ్ పాల్గొన్నారు.

## భూ హక్కు చట్టం రద్దుచేయాలి

- భోగి మంటల్లో జీవో ప్రతులు దహనం



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

**మహారాణిపేట, జనవరి 14:** ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కుల చట్టం రద్దు చేయాలని కోరుతూ, న్యాయవాదులు భోగి మంటలు వేసి ఆ జీవో ప్రతులను వాటిలో వేసి దహనం చేశారు. కొద్దిరోజులుగా భూ యాజ మాన్య హక్కు చట్టం జీవో 512ను రద్దు కోరుతూ విశాఖ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం శిబిరం ఎదుట భోగి మంట వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఏడాది అక్టోబరు 31వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన జీవో 512 భూ యాజమాన్య హక్కుల చట్టం ప్రజల కనీస హక్కును కాల రాస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ఆస్తి హక్కులనూ హరించి వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తులకు రక్షణ లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. ప్రజా వ్యతిరేకంగా ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు వురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## 25వేల ఉద్యోగాలు భర్తీ చేయాలి

- నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంతకుమార్



బొత్సకు వినతి పత్రం అందిస్తున్న హేమంతకుమార్

**అక్కయ్యపాలెం, జనవరి 14 :** కొవిడ్, ఇతర కారణాలతో జరిగిన ఉద్యోగాల భర్తీ ఆలస్యమైనందున, గత నాలుగేళ్లకు సంబంధించి 25 వేలకు తక్కువ కాకుండా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ డిమాండ్ చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా హేమంతకుమార్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత అనేక నిరసనల మేరకు మంత్రి బొత్స మెగా డీఎస్సీని సంక్రాంతి తర్వాత ఇవ్వనున్నట్టు ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. డీఎస్సీలో పీఈటీ అభ్యర్థులకు వ్యాయామ పరీక్ష రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం నిరుద్యోగులపై బనాయించిన కేసులన్నీ ఎత్తివేయాలన్నారు.లో ఉద్యోగ వయోపరిమితి జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థులకు ఐదు గ్రేస్ మార్కులు వేయాలన్నారు. ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన ప్రకారం పోలీస్ శాఖలో 26 వేల ఉద్యోగాలు భర్తీచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కనకమహాలక్ష్మి ఆలయంలో సంక్రాంతి సందడి



ఆలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఈవో శిరీష, భక్తులు

**జగదాంబ కూడలి, జనవరి 14:** వన్‌టౌన్ కనకమహాలక్ష్మి ఆలయంలో సంక్రాంతి సందడి నెలకుంది. ఆదివారం ఈవో కె.శిరీష ఆధ్వర్యంలో భోగి పండుగను మహిళలు, పిల్లల సమక్షంలో సంప్రదాయబద్ధంగా జరిపారు. ఆలయ ప్రాంగణాన్ని పల్లెను తలపించే రీతిలో రంగుల ముగ్గులు, గొబ్బిళ్లు, రైతు, పంటలు, తాటాకు పూరిల్లుతో అలంకరించారు. హరిదాసులు, గంగిరెద్దుల మేళం, పిల్లలు గోదాదేవి వేషధారణలు, మహిళలు కోలాటంతో ఏర్పాటుచేశారు. ఈవో శిరీష దంపతులు చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. ఉదయం జరిగిన పంచామృతాభిషేకం సేవల్ల వంద మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

## నేటి నుంచి క్రికెట్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 14:** ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా వచ్చే నెల2వ తేదీ నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగే అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పేటీఎం ఇన్‌సైడర్.ఇన్ వెబ్‌సైట్‌లో ఉదయం 11.00 గంటల నుంచి టికెట్ల విక్రయించనున్నారు. ఐదు రోజులపాటు జరిగిఏ ఈ టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించి టికెట్ల ధరలను రెండు రకాలుగా నిర్ణయించారు. ఒక రోజు ఆట వీక్షించేందుకు రోజువారీ టికెట్లకు ఒక ధర, మ్యాచ్ మొత్తం ఐదు రోజుల ఆట తిలకించేందుకు మరొక ధర టికెట్లను అందుబాటులో ఉంచనున్నారు. ఒక రోజు ఆట వీక్షణకు సంబంధించి రోజువారీ టికెట్ ధరలు; రూ.100, రూ.200, రూ.300, రూ.500 కాగా...ఐదు రోజుల ఆట (మ్యాచ్ మొత్తం) వీక్షణకు టికెట్ ధరలు; రూ.400, రూ.800, రూ.1,000, రూ.1500. ఈనెల 26 నుంచి నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, ఏసీఏ వీడీసీఏ స్టేడియం కేంద్రాలుగా ఆఫ్‌లైన్‌లో టికెట్లు విక్రయాలు చేపట్టనున్నారు.

## కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

**సిరిపురం, జనవరి 14 :** అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. ఆదివారం వారు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఖాళీ కంచాలను మోత మోగిస్తూ పండగ పూట పస్తులు మాకు పండుగ మీకా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారికి సీపీఎం కార్పొరేటర్ బి. గంగారావు, బొట్టా ఈశ్వరమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎం శ్రీనివాస్, ఆర్కేఎస్వీ కుమార్, పి. వెంకటరెడ్డి, వి. కృష్ణారావు, ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అంగన్‌వాడీలపై అతి దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. యూనియన్ నాయకులు తులసి, వెంకటలక్ష్మి, నాగేశ్వరి, శోభ, కృప, శాంతి, సుజాతఉన్నారు.

## 18న 'డయల్ యువర్ సీపీ'

**మహారాణిపేట:** పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఈనెల 15 వతేదీన నిర్వహించనున్న డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని ఈ నెల 18 వ తేదీకి మార్పు చేసినట్టు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 12 వరకు ఫోన్‌లో ఫిర్యాదు స్వీకరిస్తారన్నారు.

# సింహగిరిపై వైభవంగా సంక్రాంతి సంబరాలు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్వరూపానంద, స్వాత్మానందేంద్ర సరస్వతి



ధాన్యాన్ని కుండలో నింపుతున్న యువతులు

**సింహాచలం, జనవరి 14 :** సింహగిరిపై సంక్రాంతి పురస్కరించుకుని పల్లె వాతావరణాన్ని ఆవిష్కరించారు. ఆదివారం వేకువజాము నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన గ్రామీణ ప్రజలు, రైతులతో సందడి నెలకొంది. భక్తుల ఆనందోత్సాహాల నడుమ భోగి మంట వెలిగించడం ద్వారా విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, సింహాచలం ఈఓ శ్రీనివాసమూర్తి, పాలక మండలి సభ్యులు ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. భోగి మంటల చుట్టూ హరిదాసు, జంగమదేవరలు భజనలు చేస్తూ ప్రదక్షిణంగా తిరిగారు. అనంతరం మహిళలు కొత్త బియ్యంతో పరమాన్నం తయారు చేసి పంపిణీ చేశారు. దేవాలయ మాడవీధుల్లో ప్రధాన రాజగోపురానికి ఎదురుగా పలువురు మహిళలు రంగవల్లులగా శోభాయమానంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో దేవాలయ డిప్యూటీ ఈఓ సుజాత, ఏఈవో లు భ్రమరాంబ, రమణమూర్తి, ఈఈ బందారు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

**వేపగుంట, జనవరి 14:** ఇక్కడి అప్పన్నపాలెం బీఆర్‌టీఎస్ సెంటర్ రోడ్డులో బస్సు ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందారు.ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో రోడ్డు దాటుతున్న గొలగాని అప్పలకొండ (48) అనే మహిళను సింహాచలం నుంచి వేపగుంట వెళ్తున్న 68కే నంబర్ గల బస్సు బలంగా ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అప్పలకొండ భర్త అప్పారావు, ఇద్దరు పిల్లలతో అప్పన్నపాలెంలో ఉంటున్నారు. కూలి పనులు చేసుకునే భర్త అనారోగ్యం కారణంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబాన్ని పోషించేందుకు అప్పలకొండ ఓ అపార్ట్‌మెంటులో ఇంటి పనులు చేస్తుంది. రోజూ మాదిరిగానే ఉదయం తొమ్మిది గంటలప్పుడు ఆమె రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్ వేగంగా వాహనం నడపడమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పట్నం.. పల్లెబాట!

... 5వ పేజీ తరువాయి

శనివారం రాత్రే స్వస్థలాలకు వెళ్లగా, మిగిలిన కొద్దిమంది భోగి పండగను ఇక్కడే జరుపుకుని ఆదివారం ఉదయం పయనమయ్యారు. ఈనేపథ్యంలో అనకాపల్లి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం మార్గాల్లో వాహనాల రద్దీ కనిపించింది. కాగా అటువైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ట్రాఫిక్ కనిపించలేదు. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి నగరం బోసిపోయింది. జగదాంబజంక్షన్, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, సత్యం కూడలి, మద్దిలపాలెం జంక్షన్, హనుమంతవాక కూడలి, వెంకోజీపాలెం, ఇసుకతోట, ఎంవీపీకాలనీ, గాజువాక వంటి ప్రధాన కూడళ్లు కళావిహీనంగా కనిపించాయి. సిటీబసుల్లో ఇద్దరు, ముగ్గురికి మించి ప్రయాణికులు లేరు. కాగా బీచ్‌లో కొంతమంది పతంగులు ఎగరవేసుకుని చీకటిపడేసరికి తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. పండగ ముగిసే వరకు నగరంలో ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది.

## ఏయూ వీసీ పోస్టుపై వీడని సస్పెన్స్

... 5వ పేజీ తరువాయి

నివేదికలో తాజా మాజీ వీసీ ప్రసాదరెడ్డి, మాజీ రిజిస్ట్రార్, ప్రస్తుత ఓఎస్‌డీ కృష్ణమోహన్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహనరావు పేర్లు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురూ ఎవరి మార్గాల్లో వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడం ప్రచారానికి ఊతమిచ్చింది. మాజీ వీసీ ప్రసాదరెడ్డి ఇప్పటికే ఉమ్మడి జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకుని, మళ్లీ వీసీగా వచ్చేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారని సమాచారం. మరో వైపు ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ రామ్మోహనరావు తనకున్న రాజకీయ పరిచయాలతో ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలిసింది.

**ఝాన్సీ రాకతో మారిన పరిణామాలు..**

కాగా వీసీ ఎంపికలో తాజాగా ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. సెర్చ్ కమిటీ ముగ్గురి పేర్లతో ప్రభుత్వానికి అందించిన నివేదికలో ఒకరి పేరును ఆదినుంచీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పుడు ఆయన సతీమణి ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీ అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఇదే ఇప్పుడు మాజీ వీసీకి ఇబ్బందికరంగా పరిణమించిందని చెబుతున్నారు. తాజా మాజీ వీసీకి మళ్లీ అవకాశం కల్పిస్తే రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయని మంత్రిభావిస్తున్నారని, ఝాన్సీ ఎంపీగా బరిలోకి దిగుతుండడంతో వీసీ నియామకంపై మంత్రి మరింతగా దృష్టిసారించే అవకాశముందంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ వీసీకి దాదాపు దారులు మూసుకుపోయినట్టేనంటున్నారు. మిగిలిన ఇద్దరిలో ఒకరికి ఎంపీ స్థానానికి ఖరారైన బొత్స ఝాన్సీ లక్ష్మితో పరిచయం ఉందని, ఆమె ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

**సంక్రాంతి తరువాతే...**

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంక్రాంతి తరువాత ఏయూ వీసీ పోస్టు భర్తీపై సస్పెన్స్‌కు తెరపడుతుందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రాకముందే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏయూ అధికారులు భావిస్తున్నారు. సెర్చ్ కమిటీ నివేదికలోని ముగ్గురిలో ఒకరికి కాకుండా, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తే మాత్రం వీసీ నియామక ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చే అవకాశముందంటున్నారు. ఎన్నికల తరువాత ప్రక్రియ చేపట్టాలని భావిస్తే ప్రస్తుత ఇన్‌చార్జి వీసీనే కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. మొత్తమ్మీద వీసీ ఎంపిక ప్రక్రియపై సంక్రాంతి తరువాతే స్పష్టత వచ్చే అవకాశముందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

## కేజీహెచ్‌లో సోలార్ వెలుగులు

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో విద్యుత్ ఖర్చును తగ్గించుకునేందుకు అధికారులు యత్నించారు. ఇందులో భాగంగా సీఎస్ఆర్ బ్లాక్ భవనంపై ఆర్ఎస్ఆర్ మిట్టల్ సంస్థ సహకారంతో ఐదు నెలల కిందట 120 కేవీ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుచేశారు. దీనికి సుమారు రూ.80 లక్షలు సంస్థ అందించింది. సూపర్ స్పెషాలిటీ బ్లాక్, కేజీహెచ్ ఆర్థో విభాగం భవనాలపైన మరో 230 కేవీ సామర్థ్యం కలిగిన ప్యానెల్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తంగా 350 కేవీ సామర్థ్యం కలిగిన ప్యానెల్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటి నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో నెలకు సుమారు రూ.5 లక్షల వరకు విద్యుత్ ఖర్చు తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు. నాడు-నేడులో భాగంగా చేపట్టనున్న భవన నిర్మాణాలు పూర్తయితే వాటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకుయత్నిస్తున్నారు. ఇందుకోసం పలువురు దాతలు ముందుకు వచ్చారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.

**మిగులు మొత్తంతో ఇతర అవసరాలు**

ప్రతి నెలా విద్యుత్ బిల్లులో మిగులు మొత్తాన్ని ఆస్పత్రిలో ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఏడాదికి రూ.60 లక్షల వరకు మిగులుతోందని, దీనిని మౌలిక వసతుల కల్పన, విభాగాల అభివృద్ధి, పరికరాల కొనుగోలుకు వినియోగిస్తున్నామన్నారు.

**ప్యానెల్స్ సామర్థ్యం పెంచేలా...**

ప్రస్తుత సోలార్ ప్యానెల్స్‌తో సూపర్ స్పెషాలిటీ, సీఎస్ఆర్ బ్లాక్‌లకు అవసరమైన విద్యుత్ సరఫరా అవుతోంది. మిగిలిన విభాగాలు, ఓపీ భవనాలకు విద్యుత్‌ను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం దాతల సహకారాన్ని కోరుతున్నారు.

## పండగ పూటా విషాదం

... 5వ పేజీ తరువాయి

మెహదీపట్నంలోని లంగర్‌హౌస్ ఫ్లైఓవర్ దిగుతుండగా గాలిపటం మాంజా దారం అతని మెడకు తగిలింది. దీంతో మెడ నరాలు తెగిపోయాయి. తీవ్ర రక్తస్రావంతో కింద పడిపోయిన అతను అక్కడిక్కడే మృతిచెందారు. ప్రమాదకరమైన మాంజాను వినియోగించడమే దీనికి కారణమని తెలిసింది.

కోటేశ్వరెడ్డికి రెండున్నరేళ్ల కిందట మద్దిలపాలేనికి చెందిన ప్రత్యూషతో వివాహమయింది. వీరికి ఏడాది వయసున్న కుమార్తె భువిక ఉంది. ఇటీవలే హైదరాబాద్‌కు బదిలీ కావడంతో అద్దె ఇల్లు తీసుకునేవరకూ భార్య, కుమార్తెను నగరంలోనే ఉంచి, సోదరుడి ఇంట్లో ఉంటున్నారు. కాగా కోటేశ్వరెడ్డి మృతదేహాన్ని ఆదివారం రాత్రికి నగరానికి తీసుకువచ్చే అవకాశం ఉంది. సైనిక లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు మృతుడి స్నేహితుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ దారుణ ఘటనతో పండగ పూటా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ఆటోనగర్‌పై హడావిడి!

... 5వ పేజీ తరువాయి

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భూసేకరణలో మతలబులు?**

భూముల సేకరణ సమయంలోనే మతలబులు జరిగాయని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలు ఏకమై భూముల క్లాసిఫికేషన్ మార్పు చేసి లబ్ధిపొందారన్న ఆరోపణలున్నాయి. ఉదాహరణకు రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములను కేవలం రైతుల ఆధీనంలో ఉన్నాయని మార్చారంటున్నారు. ఏళ్లుగా తోటలు పెంచుకుని జీవిస్తున్న వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ భూముల్లో కొంతవిస్తీర్ణాన్ని ఇతరుల పేరిట నమోదు చేయించారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఆటోనగర్‌కు భూములు ఇచ్చిన రైతుల సమక్షంలోనే బహిరంగ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

## 'ముస్లింలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలి'

**అక్కయ్యపాలెం, జనవరి 14 :** వచ్చే ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యం కల్పించి ఎమ్మెల్యే టికెట్టు కేటాయించాలని వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ కమిటీ రాజకీయ పార్టీలనుంచి డిమాండ్ చేసింది. రైల్వే న్యూకాలనీలోనిఓ హోటల్‌లో ఆదివారం ముస్లిం నేత హైదరాలి సింకా అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులుమాట్లాడుతూ ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని వాపోయారు. నాయకులు షేక్ షరీఫ్,హైదరాలిసింకా, బండ్‌మునీర్, అమీర్‌జాన్, అహ్మద్‌వల్లి,మునీర్‌ఖాన్ ఉన్నారు.


వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి అర్జున్ మేఘవాల్

## మన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శం

**- కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ మేఘవాల్**

**విశాఖపట్నం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి) :** మన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శమని కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ మేఘవాల్ అన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలకు ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాలో భారత్ ఖ్యాతి విశ్వవ్యాప్తిమైందని, అంతరిక్ష పరిశోధనల్లోనూ అగ్రస్థానంలో ఉందని చెప్పారు.

### కేంద్ర మంత్రిని కలిసిన న్యాయవాదులు

కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌ను నగరానికి చెందిన న్యాయవాదులు ఆదివారం కలిశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల జరిగే నష్టాల గురించి ఆయనకు వివ రించారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఈ చట్టానికి వ్యతిరేకంగా వినతులు ఇస్తున్నా రని, ఇప్పటికే పది వినతులు అందాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అహ్మద్, బార్ అసోసియేషన్ కార్యదర్శి పైలా శ్రీను, సీనియర్ న్యాయవాదులు బేవార సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పుడవి విరాజ్, సనపల ప్రసాద్, పలక శ్రీరామ్మూర్తి, పీలా ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ పేరిట జగన్ ప్రభుత్వం మళ్లీ మోసం : ప్రణవ్

**ఎంవీపీ కాలనీ, జనవరి 14 :** జగన్ ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరిట మళ్లీ మరో మోసానికి తెర తీసిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా డీఎస్సీ, ప్రత్యేక హోదా, 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇలా ఏ ఒక్క హామీ నెరవేర్చని జగన్ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ ఎవరిని మోసగించడానికి డీఎస్సీ నాటకం ఆడుతోందని ప్రశ్నించారు.

## ఐదుగురి అరెస్టు

**భీమునిపట్నం (రూరల్), జనవరి 14 :** మండలంలోని చిప్పాడ శివారు కల్లాల్లో కోడి పందాలు ఆడుతున్న ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్టు భీమిలి సీఐ రమేష్ తెలిపారు. వారి నుంచి నాలుగు పుంజులు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

## జీవో నంబరు 1062 రద్దు చేయాలి

**ఆనందపురం, జనవరి 14 :** లారీ డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 1062 జీవోను రద్దు చేయాలని జయహో రథసారధి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు బీవీవీ కల్లాలు రోడ్డులో ఉన్న శుభశ్రీ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈసందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓలేటి వాసు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగితే డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్షతో పాటు ఏడు లక్షల రూపాయల జరిమానా వేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే పార్లమెంటులో ప్రవేశపెట్టిన 1062 జీవోను రద్దు చేయాలన్నారు.

## 18న ఎదురులేని మనిషి సిడి ఆవిష్కరణ

**భీమునిపట్నం, జనవరి 14 :** ముఖ్యమంత్రి జగన్ ప్రజా వ్యతిరేక పాలనపై ఇప్పటివరకూ ఏడు ఆడియో సిడిలు విడుదల చేశామని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 18న ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని ఎదురులేని మనిషి ఆడియో సిడిని విడుదల చేస్తామన్నారు. అనంతరం ఎదురులేని మనిషి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు రాజేంద్ర ప్రసాద్, జేపీ రాజు, వెంకటరావు, కె. కిషోర్ పాల్గొన్నారు.

### సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

### రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23,టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 17, క్యారేట్ 32, దొండకాయలు 20, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోస కాయలు 36, వె ల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 32 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 599 |
| విజయనగరం | 603 |
| శ్రీకాకుళం | 603 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 100 |
| ఫారం ధర | -- | 120 |
| విత్ స్కిన్ | -- | 210 |
| స్కిన్‌లెస్ | -- | 220 |


సింహాచలంలో గోదా, రంగనాథుల కల్యాణం జరుపుతున్న అర్చకులు


పద్మనాభంలో గోదా, రంగనాథుల విగ్రహాల తిరువీధి

# వైభవంగా గోదాదేవి, రంగనాథుల కల్యాణం

**సింహాచలం, జనవరి 14 :** వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధీనంలోని కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం ఆదివారం కన్నుల పండు వగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణవేదికపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఉంచి ముఖ్య అర్చకులు గొడవర్తి సింహగిరి సారథ్యంలో కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ఈఓ శ్రీని వాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు. కాగా వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గోదా రంగనాథుల తిరుకల్యాణ మహోత్సవంతో పవిత్ర ధనుర్మాసోత్సవాలు ముగిసాయి.

**పద్మనాభంలో...**

**పద్మనాభం :** పద్మనాభంలోని అనంత పద్మనాభుని దేవస్థానంలో గోదా, రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈఓ ఎస్. నానాజీబాబు ఆధ్వర్యంలో ముందుగా వేకువజామున నగర సంకీర్తన, నామ సంకీర్తన, స్వామివారికి బేడాసేవ చేశారు. అనంతరం గోదా, రంగనాథుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకీపై రాజవీధి మీదుగా ఊరేగింపుగా గోస్తనీ నదికి తీసుకువెళ్లి స్వామివారు, అమ్మవార్లకు స్నానమాచరించే నీలాటోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కుంతీమాధవస్వామి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉత్సవ విగ్రహాలను నిలిపి కల్యాణం జరిపారు.గిరిపై ఉన్న అనంత పద్మనాభుడి ఉత్సవ విగ్రహాలతో పాటు కొండ దిగువ ఉన్న కుంతీమాధవ స్వామి, నారాయణేశ్వర్యాస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, సర్పంచ్ పాప, పద్దు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎర్రన్నాయుడు దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పొట్నూరులోని పురాతన కోదండరామస్వామి ఆలయంలోనూ గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

**వెంకోజిపాలెం/ఆరిలోవ :** ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు వెంకటరమణాచార్య, గోపాలాచార్యులు గోదా, రంగనాథుల కల్యాణ వృత్తాంతాన్ని భక్తులకు వివరిస్తూ పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. కొత్తవెంకోజీపాలెంలోని వైభవ వెంకటేశ్వస్వామి ఆలయంలో గ్రామసేవా సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ఆరిలోవలోని రాజీవ్‌నగర్‌లో ఉన్న లక్ష్మీనారాయణ ఆశ్రమంలోనూ గోదాదేవి కల్యాణం జరిపారు

## అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

**సింహాచలం, జనవరి 14 :** వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఎనర్జీ చైర్మన్ అండ్ కొందరు సభ్యులు, దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ ఉన్నారు.

## చెడును దహనం చేయడమే భోగి పరమార్థం

**సింహాచలం, జనవరి 14 :** భోగి పండగ అంటే చెడును దహనం చేసి మంచిని పెంచుకోవడం అని శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. సింహగిరిపై దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలను ఆదివారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతితో కలిసి వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని, భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. భోగి తరతరాలుగా వస్తున్న పండుగ అన్నారు.

## కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

**పద్మనాభం, జనవరి 14 :** పద్మనాభంలోని అనంత పద్మనాభుని దేవస్థానం భూముల్లో అక్రమ కట్టడాల తొలగింపు ఆదివారం కూడా కొనసాగింది. ఈ భూముల్లో ఇప్పటికే ప్లాట్లు వేసిన స్థలం, గ్రావెల్ తవ్విన స్థలాలను మట్టితో కప్పివేయగా, నిర్మాణంలో ఉన్న మూడు ఇళ్లను తొలగించారు. ఆలయ ఈఓ నానాజీబాబు ఆధ్వర్యంలో ఈ తొలగింపు ప్రక్రియను చేపట్టారు.



## వాడవాడలా భోగి పండుగ

**భీమునిపట్నం/ఎండాడ, జనవరి 14 :** తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్నిచోట్లా భోగి పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. భీమిలి బీచ్‌రోడ్ పైలాన్ వద్ద ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక భోగి మంట వేశారు. పైలాన్ పరిసరాలను మామిడి తోరణాలు,చెరకు గడలు, పువ్వులతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రమణ ప్రసాద్, అడిదం కిషోర్ పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలోనూ భోగి మంట వేశారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీవోల ప్రతులను నాయకులు మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎండాడలో ఉన్న జనసేన భీమిలి నియోజకవర్గం పార్టీ కార్యాలయంలోనూ భోగి మంటల్లో చీకటి జీవోల ప్రతులను వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ భీమి నియోజకవర్గం సమన్వయకర్త పంచకర్ల సందీప్, 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, నాయకులు టీవీ కృష్ణయ్య చంద్ర సత్యనారాయణ, నాయుడు, సుధీర్ పాల్గొన్నారు.

**మధురవాడ :** మధురవాడ పరిసర ప్రాంతాల్లో భోగి పండుగను సంప్రదాయబద్ధంగా జరిపారు. రేవళ్ళపాలెంలో మహిళలు కోలాటం ఆడుతూ భోగి మంట వద్ద భజనలు చేశారు. మధురవాడ, స్వతంత్రనగర్ కాలనీ, రేవళ్ళపాలెం, మిథిలాపురి వుడా కాలనీ, కొమ్మాది, బక్కన్నపాలెం ప్రాంతాల్లో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు.

**ఆరిలోవ :** ఆరిలోవలోనూ భోగి ఘనంగా జరిపారు. వేకువజామున వీధుల్లో భోగి మంటలు వేశారు. పెదిగదిలిలో శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున భోగి మంట వేయడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.


స్కైలైన్ అపార్ట్‌మెంట్ వద్ద భోగి వేడుకలు

**రామ్‌నగర్ :** రామ్‌నగర్‌లోని అన్ని వీధుల్లోనూ భోగి మంటలు వేశారు. కొన్నిచోట్ల యువత మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు.

### స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో ...

**ఎండాడ :** ఎండాడలోని స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో భోగి ఘనంగా నిర్వహించారు. వేకువజామున అపార్ట్‌మెంట్స్ ఆవరణలో భోగి మంట వేసి, రంగు రంగుల ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాలు, ప్రత్యేక వంటకాలు, హరిదాసుల కీర్తనలు, గాలి పటాలతో వైభవంగా వేడుకలు నిర్వహించారు. అలాగే ఎండాడ, గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్, విశాలాక్షినగర్, రామాలయం వీధి ప్రాంతాల్లోనూ భోగి మంటలు వేశారు.

**సాగర్‌నగర్ :** సాగర్‌నగర్, రుషికొండ, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లోనూ భోగి సందడిగా జరిపారు. సాగర్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలి వద్ద భారీ భోగిమంట వేశారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. గుడ్లవానిపాలెం, రుషికొండ, స్వర్ణభారతి నగర్ ప్రాంతాల్లోనూ యువకులు భోగి మంట వేశారు. కాగా రుషికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



## అప్పన్నకు పాడి పంటలు సమర్పణ

**సింహాచలం, జనవరి 14 :** వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు తాము పండించిన పాడి పంటలను ఆదివారం సమర్పించారు.క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయం ముందు కొబ్బరికాయలు కొట్టే వద్ద, కొండదిగువ తొలిపావంచా వద్ద ఉదయం నుండే రైతులు తమ వెంట తీసుకువచ్చిన పాలు, పెరుగు, వరి, కూరగాయలను స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కూరల్లో అత్యధికంగా గుమ్మడి కాయలు సమర్పించారు.

## ఘాట్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

**సింహాచలం, జనవరి 14 :** సింహగిరికి వెళ్లే ఘాట్ రోడ్డులో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. ఆదివారం వేకువజాము నుండే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎక్కువ మంది ద్విచక్ర వాహనాలు, కార్లలో రావడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఒకవైపు గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు వాహనాల రద్దీని నియంత్రించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ వాహనదారులు ఇష్టానుసారంగా రావడంతో ట్రాఫిక్ స్తంభించింది.

## ఉత్సాహంగా ముగ్గుల పోటీ

**వెంకోజిపాలెం, జనవరి 14 :** కొత్త వెంకోజిపాలెంలోని సాయి మందిరం మార్గంలో గణేష్ షెటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. పోటీల్లో ఎ. సావిత్రి, బోర స్వాతి, జి. మోహిని, కాళ్ల కృపారాణి మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు. వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

## ముగిసిన ధారోత్సవాలు

**సింహాచలం, జనవరి 14 :** వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 10వ తేదీ నుంచి జరుగుతున్న ధారోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈమేరకు నీలాదేవి, భూదేవిలతో స్వామివారు ఒక పల్లకిలో, ఆళ్వార్లు వేరే పల్లకిలో నీరాట్టానికి గంగధారకు తరలివెళ్లారు. మండపంలో దేవతా మూర్తులను ఉంచి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అనంతరం పవిత్ర గంగధార జలాలతో అభిషేకాలు చేసి షోడశోపచారాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని వెయ్యి పాశురాలను, తిరుప్పావై 30వ పాశురాన్ని పారాయణలు చేశారు.

## పర్యావరణ హితంగా భోగి మంట

**బీచ్ రోడ్డు, జనవరి 14 :** ఆర్కే బీచ్ వైఎంసీఏ ఎదురుగా వున్న కారు పార్కింగ్ ప్రాంతంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణహిత భోగి మంట వేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథ్ సన్యాసిరావు మాట్లాడుతూ ఎకో వైజాగ్ అమలవుతున్న నగరంలో టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా గోమయంతో తయారు చేసిన పిడకలు, నెయ్యి, ముద్ద హారతి కర్పూరంతో భోగి మంట వేయడం ఆనందదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ పండగలను పర్యావరణానికి హాని లేకుండా జరుపుకోవాలని కోరారు. వేడుక వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## తీరంలో పతంగుల సందడి


తీరంలో ఎగురవేస్తున్న గాలిపటాలు

**బీచ్ రోడ్డు, జనవరి 14 :** సాగర తీరం పతంగులతో ఆదివారం కళకళలాడింది.ఆటు వైఎంసీఏ నుంచి ఇటు కోస్టల్ బ్యాటరీ వరకు పర్యాటకులు సందడి చేశారు. ఇసుక తెన్నెలపై గాలిపటాలు ఎగరవేస్తూ పిల్లలు, యువత కేరింతలు కొట్టారు. జన తాకిడి ఎక్కువగా ఉండడంతో కొన్నిచోట్ల వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.